జిందగీ
చిరాత్రేచ
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 27 జనవరి 2025
www.ntnews.com

కథాసుధ

కళ్లజోడు

ఓ ఆశ్రమంలో ప్రతి పౌర్ణమికీ సత్సంగం జరుగుతుంది. ఒక కంటి అద్దాల వ్యాపారి క్రమం తప్పకుండా ఆశ్రమానికి వెళ్తుండేవాడు. సత్సంగం పూర్తయ్యాక, అక్కడ ఉండే పుస్తకాల అంగడి ముందు చాలాసేపు నిలబడే వాడు. చివరిగా తనకు నచ్చిన ఆధ్యాత్మిక పుస్తకాన్ని బేరమాడకుండా కొనేవాడు. ఆ పుస్తకాల అంగడి యజమాని ఎంతో ఆధ్యాత్మిక చింతన ఉన్నవాడు. ఆశ్రమానికి వచ్చిన ప్రతిసారీ అద్దాల వ్యాపారి పుస్తకాలు కొనడాన్ని అతను ఆసక్తిగా గమనించేవాడు. ఒక పౌర్ణమి రోజు సాయంత్రం అద్దాల వ్యాపారితో 'మీరు మంచి చదువరిలా ఉన్నారు. అందుకే ఖర్చుకు ఏమాత్రం వెనకాడ

కుండా పుస్తకాలు కొంటూ ఉంటారు. ఏ నెల కొన్న పుస్తకాలు ఆ నెల చదివేస్తారా?' అని అడిగాడు అంగడి యజమాని. 'నేను పుస్తకాలు చదువుతానని మీకు ఎవరు చెప్పారు? నేను పుస్తకాలను కొంటానే కానీ చదవను' అని బదులిచ్చాడు అద్దాల వ్యాపారి. అందుకు అంగడి యజమాని 'ఎందుకలా చేస్తారు?' అని ఆశ్చర్యంగా అడిగాడు. 'పుస్తకాలు కొంటే మంచిదని నా చిన్నప్పుడు మా నాన్న చెప్పేవాడు. అందుకని కొంటున్నాను' అని సమాధానమిచ్చాడు అద్దాల వ్యాపారి. చిన్నగా నవ్విన అంగడి యజమాని 'పుస్తకాలు కొంటే ఏదో ఒకరోజు చదువుతారని మీ నాన్న అలా చెప్పి ఉంటాడు. పుస్తకాలను కొని ఇంట్లో పెట్టుకుంటే ఏమి లాభం? పుస్తకాలు కొనడం మంచిదని తెలిసిన మీకు, వాటిని చదవడం కూడా మంచిదని తెలిసే ఉండాలి. మనం అనేక మంచి విషయాలను వింటాం, తెలుసుకుంటాం. అయితే ఆచరించడానికి వెనుకాడుతాం. కార్యాచరణలో పెట్టడానికి వాయిదాలు వేస్తాం. పుస్తకాలను కొని అలంకరణగా ఇంట్లో పెట్టుకుంటే ఏమి ఉపయోగం? ఇకనైనా చదవడం ప్రారంభించండి' అని సలహా ఇచ్చాడు. 'నిజమే.. కళ్లు ఉంటేనే కదా, కళ్లజోడు ఉపయోగం. కళ్లే లేకుంటే ఎంత ఖరీదైన కళ్లజోడు అయినా నిరుపయోగమే కదా. కాబట్టి కొన్న పుస్తకాలన్నిటినీ చదవడం ప్రారంభిద్దాం' అని మనసులో నిశ్చయించుకొని అక్కడినుంచి కదిలాడు కళ్లజోళ్ల వ్యాపారి.

...✍ ఆర్సీ కృష్ణస్వామి రాజు,
93936 62821

సుఖదుఃఖాలు లాభనష్టాలు

సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ
తతో యుద్ధాయ యుజ్యస్వ నైనం పాపమవాప్స్యసి!
(భగవద్గీత 2-38)

నేనూ, నావారనే మోహంలో మునిగి అస్త్రసన్యాసం చేసిన అర్జునుడిని కర్తవ్యోన్ముఖుడిని చేసే ప్రక్రియలో భాగంగా కృష్ణపరమాత్మ.. 'జయాపజయాలను, లాభనష్టాలను, సుఖదుఃఖాలను సమానంగా భావించి యుద్ధానికి సిద్ధమవ్వు.. అప్పుడు నీకు పాపాలు అంటవు' అని పేర్కొన్నాడు.

వ్యక్తిత్వ వికాసానికి చక్కని మార్గదర్శనం చేసే శ్లోకం ఇది. కర్తవ్యాన్ని నిర్ణయించుకోవడంలోనే చేయాలా వద్దా.. అది లాభమా నష్టమా? ఆ పనిని చేయడం సుఖంగా ఉంటుందా.. ఇలాంటి సందిగ్ధత వెలుగు చూస్తుంది. అయితే అంచనాలతో పనిని ఆరంభించి.. ఆశించిన ఫలితం రాకపోతే బాధపడతాం. అలాగే జయాపజయాలు కూడా! ఆరంభిస్తేనే కదా ఫలితం వస్తుంది. మీనమేషాలు లెక్కిస్తూ కూర్చునే వానికి ఫలితాన్ని ఆస్వాదించే అవకాశమే లేదు.

సాధారణంగా మన జీవితం ఒక ఫుట్‌బాల్ లాంటిది. ఎవరో తంతారు.. ఎటో వెళ్తాము.. అక్కడ మరొకరు తంతారు.. మరొకచోటికి వెళ్తాము! పై అధికారి తిట్టవచ్చు.. వినియోగదారుడు నిరసించవచ్చు.. కుటుంబం ఈసడించవచ్చు. అర్హత ప్రాతిపదికగా మనకు రావలసిన పదోన్నతిని మరొకరు తన్నుకుపోవచ్చు.. భార్యాభర్తలు ఒకరినొకరు మోసం చేసుకోవచ్చు.. ఇవన్నీ మనకు కష్టాన్ని కలిగించే అంశాలే. ఒక పనిని చేసినప్పుడు అది సత్ఫలితాన్ని ఇస్తే సంతోషం కలుగుతుంది. లేనినాడు.. దుఃఖం మిగులుతుంది. దుఃఖం కలుగుతుందని పని చేయకపోవడం సమంజసమా? ఆకలేస్తే.. భోజనం వండుకోవాలి. వండటం బాధాకరమని మానేస్తే ఆకలి తీరేదెలా? బాధపడటం మనసుకు అలవాటైతే ప్రతి చిన్న కారణానికీ అది బాధపడుతుంది.

యోగం అంటే జతపరచడం. బుద్ధిని కర్మాచరణతో జతపరచడం యోగంగా చెబుతారు. అయితే పనిచేస్తున్న సమయంలో కొన్ని పొరపాట్లు జరుగుతాయి. తప్పు జరుగుతుందని పనిచేయడం మానేయడం కన్నా.. బాధలను మౌనంగా భరించడమే ఉత్తమం. అనంతమైన శక్తి నిశ్శబ్దాన్ని ఆశ్రయించి అంతరంగంలో సుప్తావస్థలో నిక్షిప్తమై ఉంటుంది. దానిని జాగృతపరచాలి. నిశ్శబ్దం ఉన్నతమైన ఆలోచనలకు నెలవు. అది సమస్యలను పరిష్కరించడంలో భాగస్వామి అవుతుంది. అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సహాయం చేస్తుందే కాని అహంకారాన్ని దరిచేరనీయదు. కాని మనలో చాలామంది ఆ అంతరంగంపై అహంకారం, మమకారంలాంటి ముసుగులను కప్పి, అంతరంగ శక్తిని వెలుగు చూడనీయకుండా బలహీనపరుస్తుంటారు. సాధించగలననే నమ్మకం.. అసాధ్యాలను సుసాధ్యం చేస్తుంది. రామాయణంలో హనుమంతుడు నిబద్ధత, శ్రద్ధ, భక్తివిశ్వాసాలు అనే ఉపకరణాలతో తన ఆంతరంగిక శక్తి సామర్థ్యాలను జాగృతం చేసుకోగలిగాడు. అందుకే ఉదాత్తమైన రామకార్యాన్ని నిర్వహించగలిగాడు.

శత్రువును అనుసరించినప్పుడు మాత్రమే శత్రువును దెబ్బతీయడం సాధ్యపడుతుందని జూడో, కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్ నేర్పుతాయి. జూడో అంటే శాంతత లేదా సౌమ్యత. కరాటే అంటే.. 'ఖాళీ చేతులతో' అని అర్థం. నిజానికి ఈ రెండూ ఆధ్యాత్మిక

గీతావాక్యం

సాధనలో ఉపయుక్తమయ్యే ఉపకరణాలే! భౌతిక జీవితంలో కూడా వాటి ప్రాధాన్యాన్ని తగ్గించలేం. ఎప్పుడైతే నిత్య జీవితంలో సంఘర్షణలను నివారించుకుంటామో అప్పుడు అనంతమైన ప్రశాంతత మనసులో కొలువుదీరుతుంది. సహనంతో కూడిన ప్రశాంతత అన్ని సమస్యలకు పరిష్కారాన్ని సూచిస్తుంది.
ఒక ఈతగాడు సంద్రంలో ఈదుతూనే.. నీటిపై తేలియాడుతూ ఆనందాన్ని పొందుతుంటాడు. అలాగే జీవిత సముద్రంలో కూడా సమస్యల ఆటుపోట్లు తనను కుదిపివేస్తున్నా తేలియాడితూ.. ప్రశాంతతను పొందగలిగిన వ్యక్తిని పరిణతి సాధించినవాడిగా పరిగణించాలి. పాపమనేది సమస్య! అది మనల్ని బాధించకుండా ఉండాలంటే.. సుఖదుఃఖాలను సమంగా తీసుకునే సమాహిత చిత్తాన్ని సాధించే దిశలో సాధన చేయాలి.

...✍ పాలకుర్తి రామమూర్తి

నమాజ్ అందిన రోజు

మంగళవారం
షబే మేరాజ్

ఇస్లామియా చరిత్రలో, ఖురాన్ గ్రంథంలో షబే మేరాజ్ అత్యంత పవిత్ర దినంగా కనిపిస్తుంది. రజబ్ నెల 27వ తేదీన జరిగిన ఓ అద్భుతమైన సంఘటన షబే మేరాజ్‌గా నిలిచిపోయింది. షబే అంటే రాత్రి, మేరాజ్ అంటే నిచ్చెన. ఇదే రోజు ముహమ్మద్ ప్రవక్త (స) సప్త ఆకాశాలకు వెళ్లి.. అల్లాహ్‌తో స్వయంగా మాట్లాడారు. అద్వితీయమైన ఈ రాత్రి ఘడియల్లోనే ఆయన స్వర్గ సౌఖ్యాలను తిలకించారు. నరక శిక్షలనూ చూశారు. అంతేకాదు, ముస్లిం సమాజానికి నమాజ్ కానుకగా లభించిన రోజు కూడా ఇదే! అందుకే ఈ పర్వదినాన్ని ముస్లింలు 'షబే మేరాజ్'గా ఘనంగా జరుపుకొంటారు. ఆనాడు రాత్రి జిబ్రయీల్ దూత ద్వారా ప్రత్యేక వాహనంపై ప్రవక్త (స)ను సప్త ఆకాశాలకు పిలిపించుకున్నాడు. ఈ యాత్రను ఇస్రా మేరాజ్‌గా ఖురాన్ పేర్కొన్నది. ఖురాన్ గ్రంథంలోని 17వ అధ్యాయం మొదటి వాక్యం చదివితే ఆ అద్భుత

ఇస్లాం బోధ

ప్రయాణం గురించి బోధపడుతుంది. ఈ పర్యటనలో ప్రవక్త (స)కు ఒక్కో ఆకాశంలో ఒక్కో దైవ ప్రవక్త స్వాగతం పలికారు. చివరికి సిదరతుల్ మున్ తహా అనే రేగుచెట్టు దగ్గరికి ప్రవక్తను తీసుకెళ్లారు జిబ్రయీల్ దూత. ఇక్కడ మహాప్రవక్త ఎన్నో అగోచర యథార్థాల్ని వీక్షించారు. కాసేపటికి అటు నుంచి 'అస్సలాము అలైకుం; ముహమ్మద్! నేనే విశ్వప్రభువును' అనే గంభీరమైన వాణి విన్పించింది. ఇక్కడే అల్లాహ్‌తో సంభాషించారు. స్వర్గనరకాలు, మరెన్నో అద్భుతాలను చూసిన ప్రవక్త (స) తన సందేశాల ద్వారా ఇస్లాం సమాజానికి వాటి విశేషాలను తెలియజేశారు. స్వర్గ ప్రవేశానికి అర్హత ఎలా సాధించాలో బోధించారు. నరక బాధలు తప్పాలంటే ఎలా నడుచుకోవాలో సూచించారు.

...✍ ముహమ్మద్ ముజాహిద్
96406 22076

రాసలీలా వైభవం-10

రాసలీల.. కామవిజయ లీల!

ము నివరుడు శుకుడు ఇలాగని వినిపించగా భూజాని- రాజు ఇట్లని అన్నాడు...

మత్తకోకిల॥
'ధర్మకర్తయు ధర్మభర్తయు ధర్మమూర్తియునైన స
త్కర్ముడీశుడు ధర్మశిక్షయు ధర్మరక్షయు జేయగా
నర్మిలిన్ ధర మీద బుట్టి పరాంగనా జన సంగమే
ధర్మమంచు దలంచి చేసె? నుదాత్త మానస! చెప్పుమా?'

'మహాత్మా! ఈశ్వరుడు ధర్మానికి కర్త, భర్త కదా! ఆయన స్వరూపమే ధర్మం! సత్కర్మలాచరించే పుణ్యమూర్తి కదా! ధర్మాన్ని బోధించడానికి, రక్షించడానికి, బాధించేవారిని శిక్షించడానికి అవనిలో అవతరించినవాడు గదా! మునీశ్వరా! అట్టి భగవంతుడు- అనంగ జనకుడు, సంగర హితుడు, ఆప్తకాముడు (అన్ని కోరికలు తీరిన వాడు), అది ఏమి ధర్మమని మదినెంచి పరాంగనలతో సంగమించాడో నాకు వివరంగా చెప్పండి? రాజయోగి మాటలు విని శుకయోగి ఇలా అన్నాడు..

ఆ॥ 'సర్వభక్షకు డగ్ని సర్వంబు భక్షించి
దోషిగాని పగిది దోషమైన
జేసి దోషపదము జెందరు తేజస్వు
లగుట జంద్ర వాసవాదు లధిప!'

ఉర్వీశా! సర్వభక్షకుడైన అగ్నిదేవుడు సర్వమూ భుజించి కూడా అశుచి- దోషి కానట్లు, అరవింద భవుడు (బ్రహ్మదేవుడు), ఇంద్రుడూ, చంద్రుడూ, విశ్వామిత్రుడూ మొదలైన తేజోవంతులు ఆర్యులు దోషయుక్తాలైన కార్యాలు ఆచరించినా దోషఫలాన్ని పొందరు.

క॥ 'ఈశ్వరుడు గానివాడు న
రేశ్వర! పరకాంత దలచి యెట్లు బ్రదుకు? గౌ
రీశ్వరుడు దక్క నన్యుడు
విశ్వ భయద విషము మ్రింగి వెలయం గలడే?!'

రాజా! ఈశ్వరులు- సమర్థులు శాస్త్రానికి వశులై (కట్టుబడి) ఉండరు. వారు ఇష్టానుసారం ధర్మాన్ని- చట్టాన్ని అతిక్రమిస్తుంటారు. వారికది కష్టప్రదం కాదు, నష్టదాయకమూ కాదు. ఈశ్వర, దేవతా, మానవ ధర్మాలు విడివిడిగా ఉంటాయి. కాని ఉమ్మడి- కలిసికట్టుగా ఉండవు. మానవ ధర్మాలు మానవులకే కాని, పశుపక్ష్యాదులకు, దేవదానవులకు వర్తించవు. సంకుచిత బుద్ధిగల మానవుడు అనుచితంగా తన ధర్మాన్ని దేవునిపై కూడా వర్తింపజేస్తాడు. అనీశ్వరుడు- ఈశ్వరుడు కానివాడు (దేహేంద్రియ ప్రాణ మనోబుద్ధులకు బద్ధుడై- లొంగి ఉండేవాడు) ఇట్టి పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ చేయరాదు. అట్టివాడు మనసులోనైనా పరకాంతను ముట్టుకొని బట్టకట్టగలడా- మనగలడా? నీల గళుడు మారవైరి- ఈశ్వరుడు కాలకూట విషం ఆరగించాడని, అనీశ్వరుడు- ధర్మకర్మలకు లోబడినవాడు అలా చేసి బ్రతకగలడా? ఈశ్వరుల- ప్రభువుల మాట మాత్రమే సత్యం. అదే ప్రమాణం. ఆర్యులు వారి మాటలనే అనుసరి

స్తారు కాని వారి కార్యాలను- చేష్టలను కాదు. దాశరథి రాముని ఆచరణ అందరికీ అనుసరణీయం. కాని, వాసుదేవ కృష్ణుని ఆదేశాలే- ఉపదేశాలే అనుసరణీయాలు. ఆయన ఆచరణలు- లీలలు మాత్రం అనుకరణీయాలు కావు.

భూధవా! (రాజా!) మాధవుని పాదారవింద పరాగ ధ్యాన పరాయణులైన సనక సనందనాది వందనీయులు కర్మబంధాలు వీడి ఎలాంటి నిబంధనలు- కట్టుబాట్లు లేక నిచ్చలు (నిత్యం) విచ్చలవిడిగా- ఇచ్ఛకొలది మెలుగుతుంటారని అంటారే. అలాంటిది, క్రీడార్థమై శుద్ధ సత్త్వమయ శరీరం స్వీకరించిన ఆ శోభనమూర్తి పుల్లాబ్జాక్షుడు- నల్లనయ్య ఎల్లా వర్తిల్లితే- నడుచుకుంటే, ఏమి? ఆయనకు బంధనాలు ఉంటాయా?

ఆ॥ 'గోప జనములందు గోపికలందును
సకల జంతులందు సంచరించు
నా మహాత్మునకు బరాంగనలెవ్వరు?
సర్వమయుడు లీల సలిపె గాక!'



మీన పోతన 194 మధురిమ వ భాగం

రాజా! ఇందిరావరుడు గోవిందుడు నందనందనుడైన వల్లవ బాలునిగా బృందావనంలో ఎల్లరి మధ్యా వర్తిల్లు (మసలు) తుండటం వల్ల అతనిని ఒక మానవ పిల్లవానిగా లౌకిక దృష్టితో చూడటం వల్ల నీకు ఇలాంటి కల్లబొల్లి సందేహం కలుగుతున్నది. గోపకులలో, గోపికలలో, ఇతర జీవరాసులలో ఎవడు అంతరాత్మయై వ్యవహరిస్తున్నాడో, అట్టి మహాత్మునికి, ఓ మహీపతీ! పరసతులు ఎవరు? స్వపరభేదం లేని- సర్వమూ తానే అయిన జ్ఞానానందమయుడు, లీలా వినోద విగ్రహుడు అయిన బాల గోపాలుని ఆ క్రీడ కేవలం దివ్య ఆనందహేల మాత్రమే! ఔత్తరేయా! 'ఆప్త కాముడైన గోవిందునికి ఈ నిందనీయమైన కర్మయందు ప్రవృత్తి- ప్రవేశం ఎందులకు కలిగింది' అని అందువేమో! 'రసరాజమైన శృంగారపు పసచే ఆకర్షింపబడు మలీమస (మాసిన) మనస్సులు గల- విషయలంపటులైన బహిర్ముఖులను కూడా పటుతరంగా- బలంగా తనకు అభిముఖులుగా- అంతర్ముఖులుగా చేయుటకే!' అని పరమార్థం.

తంగిరాల
రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

రాజా! మాధవుని మాయచే మోహితులైన గోపీ పతులు- గోపాలురు అతనిపై ఎంత మాత్రమూ అసూయ చెందక తమ సతులు తమ ప్రక్కనే ఉన్నట్లు భావించారు. సోముని (చంద్రుని)తో సమానమైన మోములు గల వామలోచనలు- ఆ గొల్ల భామలు, చంద్రవంశంలో జన్మించిన కృష్ణ చంద్రునితో నటింపగా, చుక్కలతో గూడి రిక్కరేడు (చంద్రుడు) చక్కని నాట్యం చూస్తూ ఎకసెక్కము- పరిహాసపు మాటలాడుతూ ఉండటం చేత రాత్రి తడవుగ- ఆలస్యంగా గడిచింది. తన కృపా పాత్రలైన సుగాత్రు- గోపికలకు ఆ ఒక్క క్షప- రాత్రిలోనే అనేక దీర్ఘరాత్రులను తోపించి ఉపేంద్రుడు, జీవ (నర) సఖుడు సుఖరూపుడు, అఖిలాత్ముడూ అయిన శిఖిపింఛమౌళి వారిచే దీర్ఘకాలం ఆత్యంతిక సుఖం అనుభవింపజేశాడు. బ్రహ్మముహూర్తం రాగానే తెల్లవారుజామున నల్లనయ్య అనుమతి పొంది, భగవంతునికి ప్రేమాస్పదలైన ఆ వల్లవ లేమలు ఇష్టం లేకున్నా ఎంతో కష్టంగా కృష్ణుని వదిలి తమ తమ గీము- గృహాలకు వెళ్లారు. రాసలీల దేహాత్మ బుద్ధి కలిగిన స్త్రీ-పురుష మేళనం కాదు. అంశ (జీవ), అంశీ (ఈశ్వర) మేళనం. ఈ లీలలో గోపబాలలందరూ కృష్ణమయలయ్యారు. 'శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః'- బ్రహ్మత్వం పొందిన తర్వాత జీవునికి అస్తిత్వం, స్వత్వం (ఇండివిడ్యువాలిటీ) ఉంటుందా? ఇది లౌకిక కామలీల అయితే, విశాల బుద్ధి వేదవ్యాసుడు భాగవతంలో వచిస్తాడా? అవధూత శిరోమణి వైయాసకి శుకుడు, ప్రాయోపవిష్టుడు, ముముక్షువు అయిన పరీక్షిత్తుకు ప్రవచిస్తాడా? గీర్వాణులు- దేవతలు దర్శించి నిర్వాణ- మోక్ష సుఖాన్ని అనుభవిస్తారా? ఈ భావన, చింతనతో రాసలీల పఠన శ్రవణాలు చెయ్యాలి. పరమార్థంలో.. గోవిందుడు కాని గోపిక అంటూ ఉన్నదా? అందువలన ఆ ఇందువదనలతో ఎన్ని చిందులు వేసినా, ఆ ఇంతులతో ఎన్ని గంతులాడినా, ఎన్ని పొందులు పెట్టుకున్నా ఆయన అస్ఖలిత బ్రహ్మచారే! షోడశ స్త్రీ సహస్రేశుడైనా అజస్రమూ అనాది బ్రహ్మచారే! కృష్ణుణ్ని వ్యభిచారి అనడం మన గ్రహచారం. వాస్తవానికి విష్ణుని విస్మరణమే వ్యభిచారం. పురుషుడనగా పరమాత్మే. ఆయన్ని సదా సర్వదా సేవించడమే పాతివ్రత్యం! రాసక్రీడ ప్రసంగాన్ని ఆషామాషీగా, ఈసడింపు- చులకనగా కన్నా, రోష- అసూయ ఆవేశాలతో విన్నా, దోషరోపణం చేసినా.. పాపం మూటగట్టుకుంటారని పెద్దల మాట. ప్రాకృత దృష్టితో ఎంచితేనే దోషం. పరమాత్మ దృష్టితో పరిశీలించితే నిర్దోషం, నిరవద్యం! సారాతిసారంగా- కృష్ణుడు ఆత్మ. రాధ ఆత్మాకార వృత్తి. గోపికలు ఆత్మాభిముఖ వృత్తులు (మనోభావాలు) ఇవన్నీ ధారావాహికంగా నిరంతరం ఆత్మలో రమించుటే రాసం! (సశేషం)

విమోచన

క్రీస్తు సందేశం

అన్ని బంధాల నుంచి విడుదల కావడమే.. మోక్షం. ఆ మోక్ష లోకంలోకి ఎవరు పడితే వారు తేలిగ్గా ప్రవేశించలేరు. ఎందుకంటే, కొందరు తమ బంధాల్ని, అనుబంధాల్ని తెంచుకోలేరు. అలాంటి వారికి ఆ మోక్ష ద్వారం తలుపులు తెరుచుకోవు. ఎన్నెన్ని కానుకలు ఇచ్చినా, మరెన్నెన్ని ప్రార్థనలు చేసినా దక్కని మోక్షం నిరాడంబరత, వినయగుణం, అణకువ, దాన గుణం అనే టిక్కెట్లు ఉంటే చాలు, చాలా తేలిగ్గా ప్రాప్తిస్తుందని ప్రభువు సూచించాడు. భౌతిక సంపన్నులు కాస్త తగ్గి తలదించక పోతే, మోక్షం దొరకడం దుర్లభమని ప్రభువు తెలిపాడు. 'ధనవంతుడు పరలోక రాజ్యంలో ప్రవేశించడం కన్నా.. సూది బెజ్జంలో ఒంటె దూరుట సులభమని మీతో చెప్పుచున్నాను' (మత్తయి సువార్త 19:24) అని ప్రభువు వాక్యం. సూదిబెజ్జం చిన్నది, స్థూలాకారంతో ఉండేది ఒంటె. చిన్న సూది బెజ్జంలోకి ఇంత పెద్ద ఒంటె అయినా ప్రవేశించడం ఎంతో సులభం కానీ, పరలోకంలోకి ధనవంతుడు ప్రవేశించడం చాలా కష్టమని ప్రభువు పేర్కొన్నాడు. అయితే ధనికులెవరికీ స్వర్గ ప్రవేశం దక్కదా? అనే సందేహం రావొచ్చు. సంపన్నులను కూడా ప్రభువు అనుగ్రహిస్తాడు. ఎప్పుడంటే.. ఆ ధనికులు తమ సంపదనంతా బీదసాదలకు దానం చేసి, వారి బతుకుల్లో వెలుగులు నింపాలి. అంతేకాదు ప్రభువు వాక్యం ప్రకారం నడుచుకుంటే.. తప్పకుండా పరలోకంలో వాళ్లు స్థానం పొందగలరని ప్రభువు మాట. ధనవంతుడిగా ఉండటం నేరమేమీ కాదు. కాని, అది అవసరానుగుణంగా, మితంగా ఉండాలని ప్రభువు సూచించాడు. తనకున్న సంపద తోటివారి బాగు కోసం సద్వినియోగం చేయాలి. ఇరుగు పొరుగును ప్రేమించాలి. తాను ధనికుడనన్న అహం వీడి కిందికి చూస్తే... అందుకోలేని అనంత వైభవం దానంతట అదే వరిస్తుంది. పరలోక ప్రాప్తి కూడా సిద్ధిస్తుంది.

...✍ ప్రొ॥బెర్నార్డ్ రాజు, 98667 55024

ఉపనిషత్ సారం

ఆత్మకు లేవు దూరభారాలు

ఆసీనో దూరం వ్రజతి శయానో యాతి సర్వతః
(కఠోపనిషత్తు 2-21)

'ఆత్మ ఒక చోట ఉన్నా.. దూరంగా పయనించగలదు. పడుకొని ఉన్నా.. అన్ని వైపులకూ వెళ్లగలదు..'అని పై ఉపనిషత్ వాక్యానికి భావం. శరీరానికి తప్ప ఆత్మకు దూరభారాలు లేవు. తరించిపోయిన పరమాత్మ స్వరూపులైన మహానుభావులకు అసలే లేవు. ప్రేమావతారులైన శ్రీ కుసుమ హరనాథుని జీవితంలో ఇలాంటి సంఘటనలెన్నో కనిపిస్తాయి. ఆయన ఎక్కడెక్కడి భక్తులనో వెళ్లి పలకరించేవాడనీ, రక్షించేవాడనీ లోక ప్రసిద్ధి. హరనాథ భక్తులైన భావనారుషి అనుభవం పరిశీలిస్తే ఈ విషయం అవగతం అవుతుంది.
ప్రభు హరనాథుని భక్తకోటిలో భావనారుషి గురించి తెలియనివారు ఉండరు. విజయనగరం జిల్లా, శృంగవరపు కోట సమీపంలోని తెన్నుబొడ్డవరలో ఉండేవారాయన. ఒక వేసవిలో దువ్వాడ శ్రీ హరనాథ ఆశ్రమంలో శ్రీమతి వీరమాచనేని అనసూయమ్మగారు ఏడు రోజులు శ్రీమద్భాగవత కాలక్షేపం జరిపారు. సప్తాహం అనంతరం భావనారుషి బస్సులో అరకులోయ మార్గంలో బయల్దేరారు. దారిలో ఒక లారీ అతి వేగంగా ఎదురుగా వచ్చింది. లోయ పక్కగా వెళ్తున్న వీరి బస్సు.. పట్టుదప్పి ఒక తాటిచెట్టు లోతు లోయలో పడిపోయింది. చాలామంది ప్రయాణికులు క్షతగాత్రులయ్యారు. భావనారుషి భయంతో 'కుసుమహరా' అని గట్టిగా గురు నామం స్మరించారు. ఆశ్చర్యం. వెనుకనుంచి రెండు చేతులతో నడుమును గట్టిగా పట్టుకొని, లోతైన ఆ లోయ నేలపై తనను కూర్చుండబెట్టి

నట్టు అనిపించింది. భావనారుషి కండ్లు తెరిచి చూస్తే నేలపై ఉన్నారు. శరీరాన్ని తడిమి చూసుకుంటే ఒక్క గాయమూ లేదు. చుట్టూ చూస్తే.. ఎవరూ కనిపించ లేదు. ప్రేమైక హరనాథుడే తనను రక్షించాడని భావనారుషి బలంగా విశ్వసించారు. మర్నాడు దినపత్రికల్లో దెబ్బతిన్న బస్సు ఫొటో వేశారు. భావనారుషికి జరిగిన అనుభవాన్ని దువ్వాడ శ్రీ కుసుమ హరనాథ పత్రికలో శ్రీ రాధే గోవిందపంతు వివరంగా రాశారు కూడా! ఆ వ్యాసంలో చిట్ట చివరన ఒక విచిత్రమైన చలోక్తి వాక్యమున్నది. 'శ్రీ హరనాథునికి ఒక బలహీనత ఉన్నది. ఏమిటది? శ్రీ హరనాథుడు భక్త జనుల కష్టాలను విచారించకుండా ఉండలేరు. అది ఆయన బలహీనత' అని భావనారుషి అనుభవానికి ముగింపు పలికారు గోవిందపంతు.

..✍ డా॥ వెలుదండ సత్యనారాయణ